"నువ్వు చెప్పిందంతా ఏదో కథలా వుంది. అది నిజమైనా కాకపోయినా మనకనవసరం! లక్ష రూపాయిలు వొస్తూంటే అక్ఖర్లేదని అనరెవరూ. సమాధి మీదిడబ్బు శవంతో సమానం!"

"ఎవరో చచ్చిపోతే మనకేం? ఇంతకీ ఎవరు చస్తారో కూడా మనకి తెలీదు. ఆ రేడియో యిచ్చినాయన స్పష్టంగా మరీ మరీ చెప్పాడు. ఇలా 'నాబ్' తిప్పడం, అలా అక్కడ ఎవరో చనిపోవడం, అరగంటలో లక్షరూపాయలు మనకు రావడం 'ఖాయం' అన్నాడు."

"ప్రస్తుతానికి నమ్మదాం. సరే. దాని వల్ల నీకు తప్ప ఇంకెవరికేనా ఏం లాభం. ఇందులోఏదో మోసం, ఏ అంతర్జాతీయ కుట్రో వుండొచ్చు...అని నా అనుమానం!"

"ఏమో మరి! ట్రయ్ చెయ్యమన్నావా రాజా?" ఆమె ఆ మాట అంటున్నప్పుడు ఆమె మనో నేత్రాల ముందు—పెద్ద పువ్వులతోట, తోట మధ్య మేడ, మేడలో పదుల సంఖ్య దాటిన గదులు, మొజాయిక్ ఫ్లోరింగు, ఖరీదైన ఫర్నిచర్, మెత్తని పరుపున్న పెద్ద మంచం, ఆ మంచంమీద తనూ రాజా...!

దెయ్యాన్నో భూతాన్నో చూసినట్టు చూసేడు రాజా రాణీని.

"సొమ్ము సంగతి బాగానేవుందిగాని రాణీ, ఆ చావు సంగతి తలుచుకుంటేనే నాకు ఒళ్లంతా జలదరిస్తూంది. మనక్కావల్సినవాళ్లు—మన కళ్ల ముందు పోయేరంటే చాలా బాధ వేస్తుంది. ఏడుస్తాం. మనం చేసిన పనివల్ల, పరోక్షంగానైనా కారణం 'మనమే' అవుతున్నాం. అంతే! తేడా నాకేం కన్పించటం లేదు."

"అంతేనంటావా?"

"అంతే మరి. నాకు అలాగే అన్పిస్తూంది..."

నిరాశ, అసంతృప్తి నిండిన కళ్లతో రాజాని చూసింది రాణి.

"మాటవరసకి... మన పక్కింటబ్బాయి వున్నాడు...ఎంతో ముద్దుగా 'గ్లాక్సో' బేబీలా వుంటాడు. ఆ అబ్బాయే చచ్చిపోయేడనుకో. మనకెలా వుంటుంది?"

రాణీ ఏం జవాబు చెప్పలేదు. టైమయిందంటూ రాజా తన ఆఫీసుకి వెళ్ళిపోయేడు.

*　*　*

మధ్యాహ్నం భోజనం అయ్యేక, ఆ రేడియోని పిచ్చిదాన్లా చూస్తూ కూర్చుంది రాణి. చేతులు వూరికే సలుపు పెడుతున్నాయి. డబ్బుల గలగల మెదడులో అల్లకల్లోలం రేపుతూంది.

ఆ రేడియో ఇచ్చిన ఆసామీమాటకి, రామ బాణంలా తిరుగులేదని తెలుసు. నాబ్ ఇలా తిప్పి తిప్పగానే తనకి తెలీని ఎవరో చావడం, వెంటనే చేతిలో లక్ష

రూపాయిలూ పడడం గ్యారంటీయే! అందుకు సందేహంలేదు.

రోజూ ఎందరో చస్తూంటారు...

నడిరోడ్లమీద, గుడిసెల్లో, మేడల్లో ఫేక్టరీల్లో, నీళ్లల్లో, కొండల్లో, దోపిడీల్లో మానభంగాల్లో, అలజడుల్లో, సమ్మెలలో, యుద్ధాల్లో, విప్లవాల్లో...రోజూ ఎందరో కొందరు చస్తూవుంటారు.

వాళ్ల శవాలూ, బాధా, రక్తం తనకి కన్పించనంత వరకూ ఏం ఫర్వాలేదు. ఏ బెంగా, మనస్తాపం వుండవు.

ఆకారం స్పష్టంగా తెలీని శవం—తర్వాత సెక్యూరిటీ ప్రెస్‌నుంచి అప్పుడే రిజర్వ్‌బేంక్ ఖజానాకు చేరిన సరికొత్త నోట్లకట్టలు కన్పించేయి ఆమెకి.

'పిస్టల్ పేల్చే, కత్తితో నరికో నేనెవర్నీ చంపబోవటం లేదు. ఈ నాబ్ తిప్పుతున్నానంతే! ఎందుకోసం? జీవితాంతం గాడిదచాకిరీ చేసినా సంపాదించలేని డబ్బుకోసం. అది నా ఒక్కదాని కోసమేనా? కాదే—! రాజాకోసం, పుట్టబోయే పిల్లలకోసం, బంగారు భవిష్యత్తుకోసం...' అనుకుని రాణీ లేచింది రేడియో దగ్గరికి వెళ్లి అదురుతున్న గుండెతో, వణుకుతున్న వేళ్లతో 'నాబ్'ని తిప్పింది!

*        *        *

వీధి తలుపు దబదబ చప్పుడైంది. తలుపు తీసి చూస్తే ఎదురింటి కుర్రాడు.

"ఆంటీ...ఆంటీ...మన అంకుల్‌కి ఏక్సిడెంటయ్యిందంట ... హాస్పిటల్‌కి తీసుకెళ్లేరు. నువ్వు వేగిరం రా!"

నిశ్చేష్టురాలైంది రాణీ. ఏదో తెలీని ఆవేదనతో ఉక్కిరిబిక్కిరైంది గుండెని ఏదో రాక్షసహస్తం పిండేస్తూన్నట్టు విలవిలలాడిపోయింది. 'ఏ హాస్పిటల్లో?' అని కనుక్కోనైనా కనుక్కోకుండా, వెర్రెత్తినదాన్లా వీధిలోకి పరుగుతీసింది. వీధి చివరని వున్న మెడికల్ షాపులోకి వెళ్ళి, వాళ్ల అనుమతైనా తీసుకోకుండా, రిసీవర్ ఎత్తి ఏదో నెంబర్ డయల్ చేసింది.

"హలో...హలో...దేశాయ్‌గారా? నేనండీ నేనూ రాణీని! ఇంత మోసం చేస్తారా? మరీ యింత అన్యాయమా?? లక్షరూపాయిలకోసం నా రాజాని బలి చేస్తానని ఎలా అనుకున్నారు సార్? నాకు తెలీని వాళ్లెవరో చచ్చిపోతారన్నారు మీరు...కాని—కాని ఇదేమిటి?" అంది ఒగరుస్తూ.

అవతల్నించి వెంటనే సమాధానం రాలేదు.

'హలో హలో' అంటూ కంగారుగా అరిచింది రాణి.

"ఎందుకలా అరుస్తావ్? నోర్ముయ్! నీ రాజా...అతను నీకు తెలుసనుకుంటు న్నావు. అంతేగదూ? నువ్వు ఫూల్‌వి. నువ్వెన్నడూ రాజాని సరిగ్గా అర్థం చేసుకోలేదు. అతను నీకు తెలిసినవాడని నువ్వు అనుకోవడం శుద్ధ తెలివితక్కువ! నువ్వెవరో రాజాకిప్పుడు తెలుసు. కాని. నీకే రాజా ఎవరో తెలీదు!" — అన్న మాటలు రాణీకి వినిపించేయి.

ఆ గొంతు దేశాయ్‌ది కాదు, రాజాది!